జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు రేపు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న కరీంనగర్ జిల్లాస్థాయి సీనియర్స్, జూనియర్స్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పోటీలను మహిళలు, పురుషుల విభాగంలో, బాలబాలికల విభాగాల్లో నిర్వహించనున్నామని జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ ఈ ప్రసాదరావు, సీహెచ్ రాజేందర్ రావు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సీహెచ్ అమిత్ కుమార్, మల్లేష్‌గౌడ్, సీహెచ్ సంపత్‌రావు తెలిపారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

● కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీలు

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో డిసెంబర్ 11, 12, 13, 14 తేదీల్లో మహిళలు, పురుషుల విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని మహిళలు, పురుషుల జట్లు పాల్గొంటాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జాతీయ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్లకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

పత్తి పంట.. సీసీఐ తంటా



ఎకరానికి 7 క్వింటాళ్లే కొంటామని తిరకాసు

● మిగతా దిగుబడి ప్రైవేట్‌కు అమ్ముకోవాల్సిన దుస్థితి
● ఆందోళనలో రైతులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు చేపట్టి రైతులకు మద్దతు ధర లభించేలా చూడాల్సిన సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆ కొనుగోళ్ల విషయంలో తిరకాసుపెడుతున్నది. ఎకరాకు ఎంత దిగుబడి వచ్చినా 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు మిగతా దిగుబడిని ప్రైవేట్ వ్యాపారులకు మద్దతు ధర రాకున్నా అమ్ముకోవలసిన దుస్థితిని కలిగిస్తున్నది. మద్దతు ధర పెద్దగా లాభసాటిగా లేకున్నా కనీస తోడ్పాటుగానైనా ఉంటుందని, సీసీఐ కొనుగోలు చేస్తుండడంతో ప్రైవేట్ వ్యాపారులు మరి కొంత ఎక్కువ ధర చెల్లించి పత్తి కొనుగోలు చేస్తారని ఆశించిన రైతులకు ఈ సీజన్‌లో నిరాశే మిగులుతున్నది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని జిన్నింగ్ మిల్లుల యజమానులు తేమ పేరిట కొంత ధర తగ్గిస్తూ రంగు మారిందని మరికొంత కోత విధిస్తూ కనీస మద్దతు ధర కంటే వేయి నుంచి రెండు వేల రూపాయల తక్కువ ధర చెల్లిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు.



● జిల్లాలో 50వేల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసి ఆ మేరకు పత్తి కొనుగోళ్ల కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8 నుంచి 12శాతం తేమ ఉన్న పత్తికి క్వింటాల్‌కు 8,110 రూపాయల కనీస మద్దతు ధర చెల్లించి సీసీఐ కొనుగోలు చేపట్టింది.

(మిగతా 8వ పేజీలో)

● తేమ శాతం రాక ఇబ్బందులు

కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని రైతులు తమ పత్తిని తీసుకొని కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లుకు తీసుకొని వెళ్తుండగా తేమశాతం ఎక్కువ ఉందని దానిని కొనడానికి అంగీకరించక పోవడంతో విధిలేక వారికే తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తున్నది. చాలా మంది రైతులు యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లేక ఇదంతా సమస్య ఏమిటని ప్రైవేట్‌లోనే అమ్ముకుని నష్టపోతున్నారు. వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం మూలంగా సాగు చేసిన పత్తి విస్తీర్ణం తక్కువ నమోదు కావడంతో ఎక్కువ పంట కొనుగోలు చేయడానికి సీసీఐ అంగీకరించకపోవడంతో రైతులు జిన్నింగ్ మిల్లులకు అమ్ముకుని నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్‌కు 8,110 రూపాయలు ఉండగా ప్రైవేట్‌లో 5,500 నుంచి 6,000 రూపాయల వరకు మాత్రమే చెల్లిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుండగా జిన్నింగు మిల్లుల యజమానులు తమ సమస్యలు పరిష్కరించకపోతే సోమవారం నుంచి నిరవధికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రకటించారు. వీరు ఈ నెల 6 నుంచే కొనుగోళ్లు బంద్ చేస్తామని ప్రకటించినప్పటికీ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అందుబాటులో లేని కారణంగా సోమవారం వరకు వేచి చూస్తామని చెబుతున్నారు. దీంతో కొనుగోళ్లు నిలిచిపోతాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

కొండెక్కిన కూరగాయలు

పెరిగిన ధరలతో ప్రజల ఇబ్బందులు



హుజూరాబాద్‌లో కూరగాయల విక్రయం

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు కొనలేం.. తినలేం.. అన్నట్లుగా కూరగాయల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. కూరగాయల ధరలు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వారం వారానికి కూరగాయల ధరలు పెరుగుతూనే పోతున్నాయి. మొంథా తుఫాను ప్రభావంతో కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారు. దీనికి తోడు కార్తీకమాసం జత కావడంతో కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండా ఉన్నది. ఇదే సమయంలో మార్కెట్‌కు వచ్చే కూరగాయలకు మంచి డిమాండ్ ఉన్నది.

● అన్నీ పైపైకే..

హుజూరాబాద్ మార్కెట్లో శుక్రవారం ధరలు ఈ విధంగా ఉన్నాయి. కిలో వంకాయ రూ.100, దొండకాయ రూ.120, బెండకాయ రూ.100, బీరకాయ రూ.80, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.100, గోరుచిక్కుడుకాయ రూ.100, క్యాబేజీ రూ.100. క్యాలీఫ్లవర్ రూ.100, క్యాప్సికం రూ.100, టమాట రూ.40, సొరకాయ ఒకటి రూ.50, అలుగడ్డ రూ.40, కొత్తిమీర రూ.100, బీట్‌రూట్ రూ.80, పాలకూర రూ.80, మిర్చి రూ.80, ధరలు పలుకుతున్నాయి. అలాగే పప్పుదినుసుల ధరలు ఇటీవల బాగా పెరిగాయి. సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది.

పేదలకు అందుబాటులో వైద్యం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మానకొండూర్‌లో ఆసుపత్రి నిర్మాణానికి భూమి చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందుబాటులో వైద్యం ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ. 17 కోట్ల 50లక్షలతో నిర్మించే 50 పడుకల ఆసుపత్రి నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదలకు వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం 50 పడుకల ఆసుపత్రి మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజగోపాల్, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.





వైభవంగా కార్తీక దీపోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక దీపోత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పొల్సాని సుగుణాకర్‌రావు నేతృత్వంలో పాతబజార్ గౌరీశంకరాలయ అర్చకుడు పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపం వెలిగించి ఆధ్యాత్మిక భావంతో పరవశించారు.

విదేశాల్లో ఉద్యోగాలకు వారధి
'టామ్‌కామ్'
● నకిలీ ఏజెంట్లకు చెక్
● గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి అవకాశాలు
7

జూబ్లీహిల్స్ గెలుపుపై కాంగ్రెస్..
బీహార్ ఫలితంపై బీజేపీ...
సంబరాలు
8

సీసీఐ నిబంధనలు సడలించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



జమ్మికుంటలో పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలు సడలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డును సీపీఎం ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు రైతుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిల్కూరి మాట్లాడుతూ ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల పంట పొలాల్లో నీళ్లు నిలిచి దిగుబడి మూడవ వంతుకు పడిపోయిందన్నారు. అరకొరగా రైతు చేతికి వచ్చిన పంటకు కూడా సీసీఐ కఠిన నిబంధనలు పెట్టి కొనుగోలు చేయడం లేదన్నారు. కిసాన్ కపాస్ యాప్‌లో అనేక సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. తేమశాతం, ఎకరాకు ఏడు క్వింటాళ్ల నిబంధన ఎత్తివేయాలన్నారు. మిల్లుల్లో ట్రేడర్స్ పత్తి దిగుమతి చేస్తే క్వింటాల్‌కు రూ.25 హమాలీ చార్జి రైతుల నుంచి వసూలు చేయడం సరికాదన్నారు. ప్రతి బండికి 30 నుంచి 40కిలోల తారం కట్ చేస్తున్నారని, దీన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం అశోక్, కొప్పుల శంకర్, జక్కుల రమేష్, వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, సతీష్, రవి, సంపత్‌రావు, లింగారెడ్డి, పోచయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం కఠోర సాధన చేయాలి

● చదువుపైనే దృష్టికేంద్రీకరించాలి
● బాలల దినోత్సవంలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు నిత్యం కఠోర సాధన చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపు నిచ్చారు. నిత్యం చదువుపైనే దృష్టికేంద్రీకరించాలని, ఇతర అనవసర విషయాలను పట్టించుకోవద్దని ఉద్బోధించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభి వృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్‌నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే మాట్లాడుతూ చిన్నారులు ఎంజాయ్ చేస్తూ చదువుపై దృష్టిపెట్టాలని సూచించారు. వేడుకల్లో బాలభవన్, బాలసదనం, కేజీబీవీ సంక్షేమ ట్రస్ట్ విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జేసిబివో కృపారాణి, డిసిపీవో పర్వీన్, 1098 జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్, సిడిపివోలు, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలల దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

● ప్రజలకు మెరుగైన సేవలందించాలి

చొప్పదండి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం ఆమె చొప్పదండి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను మెరుగుపరాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ఆరోగ్య కేంద్రాల్లో మందులను అందుబాటులో ఉంచాలని అన్నారు. 13 సంవత్సరాలు పైబడిన మహిళలందరికీ 100 శాతం స్క్రీనింగ్ అయ్యేటట్లుగా చూడాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవుట్ సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎం హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్ గోపాల్, పీవో ఎంహెచ్‌ఎన్ డాక్టర్ సయ్యద్ సనా జవేరియా, వైద్యాధికారి శ్రీకీర్తన సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్లకు 'టెట్' తప్పనిసరి

● సీనియర్ ఉపాధ్యాయులకు శరాఘాతం
● ఆర్‌టీఈ సెక్షన్-23ను సవరించాలని డిమాండ్

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు కూడా టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత కావలసిందే. ఐదేళ్లలోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయులు మినహా మిగిలిన టీచర్లందరూ రెండు సంవత్సరాల లోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలి లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడం సీనియర్ ఉపాధ్యాయులకు శరాఘాతంగా మారింది. పిడుగులాంటి ఈ తీర్పు ఉపాధ్యాయుల్లో తీవ్ర గందరగోళాన్ని, ఆందోళనను సృష్టించింది. అత్యుత్తమ న్యాయస్థానం ఇచ్చిన తీర్పునుంచి బయటపడటం ఎలా అంటూ సీనియర్ ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఆందోళన తొలగించాలని ఉపాధ్యాయ సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయి. ఆర్‌టీఈ యాక్టు సెక్షన్ 23ను సవరించాలి లేదా 35 మార్కులు వస్తే టెట్ పాస్ అయినట్లు పరిగణించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్ టీయు) తెలంగాణ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఆర్‌టీఈ ఆక్టు 2009 అనే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తూ 2010 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు అకాడమిక్ అర్హతలు, వృత్తిపరమైన అర్హతలు, టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) కూడా ఉత్తీర్ణుడై ఉండాలని ఎన్‌సీటీఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2010 ఆగస్టు 23కు ముందు రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఉంటుందని, ఆ తేదీ తర్వాత ఉపాధ్యాయుల నియామకాలకు టెట్ పాస్ కావాలని స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని గత సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం 2010 ఆగస్టు 23కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు కూడా టెట్ తప్పనిసరిగా మారింది. ఐతే ఉత్తీర్ణత మార్కుల నిబంధన సడలించి 35శాతం మార్కులకే ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తే బాగుంటుందని సీనియర్ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



● ఆర్‌టీఈ యాక్టు సెక్షన్-23 సవరించాలి : పీఆర్‌టీయూటీజీ

ఆర్‌టీఈ యాక్టు సెక్షన్-23ని సవరించాలి. లేదా 35శాతం మార్కులకే ఉత్తీర్ణత సాధించినట్లు పరిగణించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, కేతిరి తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీంకోర్టు తీర్పుతో సీనియర్ ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, వారి ఆందోళనను తొలగించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



లారీని ఢీకొన్న కారు


మానకొండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని స్థానిక రైస్‌మిల్లుల వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా నవదంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక సీఐ సంజీవ్ వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని కొండపాకకు చెందిన కోట సాయిచరణ్ బంధువుల వివాహం చల్లూరు గ్రామంలో గురువారం జరిగింది. ఈ వివాహానికి హాజరైన నవదంపతులను కారులో తీసుకొని శుక్రవారం తెల్లవారు జామున కరీంనగర్‌కు బయలుదేరారు. మానకొండూర్ రైసుమిల్లుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారును నడుపుతున్న సాయిచరణ్‌తోపాటు రిషికేష్‌కు తీవ్రగాయాలవగా నవదంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. నలుగురిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సాయిచరణ్ తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మర్రిగడ్డలో మూలమలుపు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కిష్టంపేట గ్రామానికి చెందిన చిగుర్ల ఎల్లయ్య, భూమండ్ల కొమురయ్య అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వేములవాడ నుంచి కిష్టంపేటకు వెళుతుండగా మార్గమధ్యలోని మర్రిగడ్డ గ్రామ శివారులో సనుగులకు చెందిన బాలురు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఈ సంఘటనలో ఎల్లయ్య, కొమురయ్యలకు కాలు విరగడంతోపాటు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు.

వేతన వెతలు

- ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు సకాలంలో అందని జీతాలు
- సర్కారు స్పందించాలని వేడుకోలు



జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్)కు వేతనాలు సకాలంలో అందడం లేదు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అసలే చాలీచాలని వేతనంతో మారుమూల గ్రామాలకు వెళ్లి పనిచేస్తున్న చిరుద్యోగులు సమయానికి జీతాలు రాక అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,038 మంది ఓపీఎస్‌లు పనిచేస్తుండగా, జగిత్యాల జిల్లాలో 28 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి పలు జిల్లాల్లో ఈ యేడాది ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. జగిత్యాల జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు చెందిన వేతనాలు అందలేదని వాపోతున్నారు.

● నాలుగేళ్ల క్రితం నియామకం..

ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిర్వహించిన రాత పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించారు. వీరిలో చాలా మంది ఉన్నత చదువులు చదువుకున్నారు. ఎప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం లభిస్తుందన్న ఆశతో చాలీచాలని వేతనాలతో ఓపీఎస్‌లుగా పనిచేస్తున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు చేసే పనులతో సమానంగా పంచాయతీల్లో ఓపీఎస్‌లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓపీఎస్‌లకు నెలకు రూ.19,500 వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. ఈ ఏజెన్సీలు వీరి ఖాతాల్లో వేతనాలు జమ చేయాల్సి ఉంటుంది. వీరి ఖాతాల్లో కేవలం రూ.15 వేలు మాత్రమే జమ చేస్తున్నారని, మిగిలిన వేతనంలో ఎందుకు కోత విధిస్తున్నారో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడం లేదని చిరుద్యోగులు వాపోతున్నారు. ఓపీఎస్‌లందరికీ క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నారు.

● భారంగా కుటుంబ పోషణ..

సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఓపీఎస్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో పైసలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అద్దెలు, ఈఎంఐలు, పిల్లల చదువులకు ఫీజులు, నిత్యావసరాలకు తిప్పలు తప్పడం లేదు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఒక్కొక్కరికి రూ.లక్షపైనే బకాయిలున్నాయి. చాలీచాలని వేతనాలు అందితేనే కుటుంబాలను కష్టంగా వెళ్లదీసే కాలంలో అసలు వేతనాలు రాకపోవడంతో ఎలా కుటుంబాలను నెట్టుకురావాలని ఓపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో వేతనాలు అందించాలి

-సిద్దం సతీష్, ఓపీఎస్ అసోసియేషన్ నాయకుడు, జగిత్యాల



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలి. అసలే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాము. ఎప్పటికప్పుడు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం.

ఓపీఎస్‌ల సమస్యలను పరిష్కరించాలి

-కె.సందీప్ రెడ్డి, ఓపీఎస్ అసోసియేషన్ నాయకుడు, జగిత్యాల



రాష్ట్రంలో ఓపీఎస్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. వేతనాలు సకాలంలో చెల్లించాలి. ఓపీఎస్‌లందరినీ రెగ్యులరైజ్ చేయాలి. క్రమబద్ధీకరణ చేస్తూ సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయాలి. వేతనాల్లో ఎలాంటి కోతలు లేకుండా ఏజెన్సీలు చెల్లించాలి.

అల్మాస్‌పూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చోరీ
- నగదు, బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చొరబడ్డారు. నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరాజు, రాజు, భూ లక్ష్మీ, లచ్చయ్యతోపాటు మరోవ్యక్తి తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల వద్దకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు వేసిన ఇళ్ల తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించారు. ఇళ్లలోని బీరువాలను ధ్వంసం చేశారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. సుమారు రూ.లక్షనగదు, రూ.2.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాలకు చేరుకుని పరిశీలించారు. జాగిలం, వేలిముద్రల నిపుణులు చేరుకుని నమూనాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రూ.7200 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7200 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 68మంది రైతులు 589 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14 క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7200, కనిష్ఠ ధర రూ.6200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఫీజు చెల్లించినా.. హాల్ టికెట్ రాలేదు..

- న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఫీజు చెల్లించినప్పటికీ కాలేజీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో హాల్‌టికెట్ రాకపోవడంతో రాజరాజేశ్వర సంస్కృత కళాశాల విద్యార్థి సాయిచంద్రిక పరీక్షరాసే అవకాశం కోల్పోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి సంఘాలు ఆమెకు అండగా నిలిచాయి. దీంతో విద్యార్థినికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం దక్కింది. శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ సంస్కృత కళాశాలలో బీఏఎల్ రెండో సంవత్సరం చదువుతున్న సాయిచంద్రిక సెమిస్టర్ పరీక్షలకోసం ఫీజు చెల్లించినప్పటికీ హాల్ టికెట్ రాలేదు. దీంతో మొదటిరోజు నిర్వహించిన రూరల్ డెవలప్‌మెంట్ సబ్జెక్ట్ పరీక్షకు ఆమెను అనుమతించలేదు. పరీక్షరాసే అవకాశం ఇవ్వకపోవడంతో ఆందోళనకు లోనైన ఆమె ఆసుపత్రి పాలైంది. ఈ విషయం తెలుసుకున్న బీసీ విద్యార్థి సంఘం నాయకుడు సాయి తదితరులు కళాశాల అధ్యాపకులను నిలదీశారు. సకాలంలో ఫీజు చెల్లించినప్పటికీ సిబ్బందిచేసిన పొరపాటు కారణంగానే హాల్‌టికెట్ రాలేదని ఆరోపించారు. ఈ అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డిని వివరణ కోరగా తప్పుగా నమోదుకావడం వల్ల ఈపొరపాటు జరిగిందని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులను కలిసి ఈ విషయాన్ని వివరించడంతో హాల్‌టికెట్ జారీచేశారని, తదుపరిపరీక్షకు సాయిచంద్రిక హాజరుకావచ్చని తెలిపారు. సాంకేతిక కారణాలవల్ల తప్పుజరిగిందని, రాయలేకపోయిన మొదటి పరీక్షను తర్వాత నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 57మందికి జరిమానా



సిరిసిల్ల: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్షతోపాటు జరిమానాలు తప్పవని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టామని, మద్యం తాగి వాహనాలు నడిపిన 57మందిని శుక్రవారం సిరిసిల్ల కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జరిమానాలు విధిస్తూ మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. వీరికి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ప్రతిజ్ఞ చేయించి కౌన్సె లింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడి పిన ఇద్దరికి రూ.6వేలచొప్పున, 12మందికి రూ.5 వేల చొప్పున, ఒక్కరికి రూ.4వేల చొప్పున, 42 మందికి రూ.వెయ్యి చొప్పున జరి మానాలను విధించారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్, పోలీసులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో 37మందికి..

ఎల్లారెడ్డి పేట: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు జిల్లా రెండోతరగతి జ్యుడీషియల్ న్యాయమూర్తి జయశ్రీ జరిమానా విధించారని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించగా 37మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని తెలిపారు.

పరీక్షల అనంతరంనివేదిక ఆధారంగా న్యాయస్థానంలో హాజరు పరిచామని చెప్పారు. 37మందికి మొత్తం 59వేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కల్లెడ శివారులో గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో కట్ట రాజేందర్, బత్తుల సుమన్ అనే వ్యక్తులను గాయాలైనట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన సుమన్, రాజేందర్ ధర్మపురి నుంచి జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో కల్లెడ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో రాజేందర్ కుడిచేతికి, సుమన్‌కు కుడికాలికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు

కోనరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికిచెందిన బంగారు ముత్తవ్వ కోతి దాడిలో గాయపడింది. గ్రామానికి చెందిన ముత్తవ్వ పనిమీద ఊరిలోకి వచ్చి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆకస్మాత్తుగా వానరం దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు ఏర్పాట్లు పూర్తి



మైదానాన్ని సిద్ధం చేయిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి 17 తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అండర్-14, అండర్-17 బాలికలు, బాలురుకు యోగా చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్ మొండయ్య, భాషాబోయిన వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది క్రీడా నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. వెలిచాల గ్రామపంచాయతీ కమ్యూనిటీ హాలులో బాలికలకు, జడ్పీఉన్నత పాఠశాలలో బాలురకు వసతి కల్పించినట్లు చెప్పారు. క్రీడాకారులందరికీ స్థానిక నాయకుడు వీర్ల హన్మంతరావు యూత్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు త్వరలో కలకత్తాలో నిర్వహించే అండర్-14 కేటగిరి, త్రిపురలోని అగర్తలో అండర్-17 కేటగిరిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, నిర్వాహకులు ఫిజికల్ డైరెక్టర్ దత్తాత్రేశర్మ, క్రీడల ఎస్‌జీఎఫ్ సహాయకులు, నిర్వాహణ బాధ్యులు మల్లేశం, నగేష్, మహిపాల్‌రెడ్డి, మహేందర్, పద్మలతాదేవి, సుజాత, పుష్పలత, హలీముద్దీన్‌షేక్, యాకుబ్ అలీ, వెలిచాల యువసేన సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో మల్యాల విద్యార్థినికి ప్రథమ స్థానం



కీర్తనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీ-సాట్, రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సంయుక్తంగా టీ-సాట్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలో రాజన్నజోన్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. చందుర్తి మండలం మల్యాల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పులికీర్తన రాజన్న జోన్‌జట్టుకు ప్రాతినిథ్యం వహించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా కీర్తనను చందుర్తి మండల విద్యాధికారి వినయ్ కుమార్, మల్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్‌చంద్ర, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పీసరి మంజుల, స్వామి వివేకానంద సేవాసమితిసభ్యులు,గ్రామస్థులు అభినందించారు.

రేకుల షెడ్డు దగ్ధం

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బురవేని సమత రేకుల షెడ్డులో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. దీంతో ఫ్రిడ్జ్, కూలర్‌తోపాటుగా మంచాలు, బట్టలు రూ. లక్ష విలువ గల500 నోటు కట్టలు దగ్ధమైనట్లు జగిత్యాల రూరల్ ఎస్.ఐ సధాకర్ తెలిపారు. బాధితురాలు సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

వరకట్నం వేధింపులతో గర్భిణి ఆత్మహత్య



సుప్రియ(ఫైల్)

రామగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల పంచాయతీ పరిధి కుర్మపల్లిలో వరకట్న వేధింపులు తాళలేక గర్భిణి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన వోడ్నాల రాజేశం కూతురు మనుశ్రీ అలియాస్ సుప్రియ(26)ను కుర్మపల్లికి చెందిన వేముల సతీష్‌కు ఇచ్చి 2023లో వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నం కింద 13 తులాల బంగారం, రూ. రెండు లక్షల విలువ గల గృహోపకరణాలు అందజేశారు. సంవత్సరం పాటు సజావుగా సాగిన వీరి దాంపత్య జీవితంలో సుప్రియకు కుమారుడు పుట్టాడు. అనంతరం భర్త సతీష్, అత్త భూలక్ష్మి, మామ చంద్ర య్య అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేశారు. ఈ విషయం సుప్రియ తండ్రి రాజేశంకు తెలుపగా యేడాది క్రితం పోతారంలో పంచాయితీ పెట్టారు. పెద్ద మనుషుల సమక్షంలో సతీష్ భార్యను మంచిగా చుసుకుంటానని ఇంటికి తీసుకుని వెళ్ళాడు. అనంతరం సుప్రియ గర్భం దాల్చింది. ఏడునెలల గర్భిణి అని చూడకుండా వేధింపులకు గురిచేశారు. గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చిన సతీష్ భార్య గర్భిణి అని చూడకుండా తీవ్రంగా కొట్టినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన సుప్రియ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు ఉరివేసుకొని మృతి చెందినట్లు బంధువుల ద్వారా అందిన సమాచారం మేరకు తల్లి దండ్రులు వెళ్ళిచూడగా బెడ్‌రూంలో సుప్రియ చేతుల గాజులు పగిలి, ఎడమచేతికి గాయాలతో ఉన్నట్లు తండ్రి రాజేశం తెలిపారు. భర్త, మామ, అత్తలు కలిసి అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. వరకట్నవేధింపులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు పరిశీలించారు. కాగా అత్త, మామ పరారీ ఉండగా భర్త సతీష్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిగారిల్లు అయిన పోతారంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం.. భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

- రూ. 10 వేల జరిమానా

జగిత్యాల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసి హత్య చేసి, సాక్ష్యాలను తారుమారు చేసిన కేసులో నిందితుడుకి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జ్ నారాయణ శుక్రవారం తీర్పు చెప్పారు. మెట్‌పల్లి బోయవాడకు చెందిన నిందితుడు వాల్గోట్ కిషోర్ 2021 డిసెంబరు 28న తన భార్య నిషితను తన ఇంట్లోనే గొంతు నులిమి చంపి, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తప్పుడు కథానాలు చెప్పి సాక్ష్యాలను దాచడానికి ప్రయత్నించాడు. ఈఘటనపై మృతురాలి తండ్రి కాశబోయిన పెద్దపోచయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎన్ సదాకర్ కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ వి రవీంద్రరెడ్డి కేసు దర్యాప్తు చేసి సాక్ష్యాలను సేకరించారు. సాక్ష్యాల ఆధారంగా పీపీ వాదనలు వినిపించగా నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన డీఎస్పీ రవింద్రరెడ్డి, ఎస్సై సదాకర్, పిపి మల్లేశం, కోర్టు కానిస్టేబుల్ టి రజిత, సియంఎస్ ఎస్సై శ్రీకాంత్, పిసిలు రాజు నాయక్, కిరణ్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గుంటూరుపల్లి వద్ద శుక్రవారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో 260గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గుంటూరుపల్లి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై ముగ్గురుయువకులను పట్టుకున్నామని, వాహనం తనిఖీ చేయగా గంజాయి లభించిందని సీఐ తెలిపారు. దుర్షేడ్‌కు చెందిన నేరెళ్ల చరణ్, గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి లోకేష్, మరోబాలుడిపై కేసునమోదు చేశామని తెలిపారు. గంజాయితోపాటు కొంతనగదును, బైక్‌నుస్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైలక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బందిని రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ అభి నందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం

శంకరపట్నం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో నేషనల్ హైవేబైపాస్ రోడ్డులో ఆగిఉన్న టిప్పర్‌ను బైక్‌ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల వివరాలప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికిచెందిన వెంగళ ప్రవీణ్, శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై కేశవపట్నం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ఇప్పలపల్లికి వెళ్తున్నారు. కేశవపట్నం శివారులో ఆగి ఉన్న టిప్పర్‌ను వీరి బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వెంగళప్రవీణ్(35) అక్కడికక్కడే మృతిచెందగా శ్రీనివాస్ పరిస్థితివిషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రవీణ్‌కు ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంజాయి కేసులో ముగ్గురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష

- రూ.10వేల జరిమానా

జగిత్యాల టౌన్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయిసాగుతో పాటు గంజాయిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ విక్రయాలు చేస్తున్న ముగ్గురు నిందితులకు ఏడు సంవత్సరాల జైల్‌శిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. గతేడాది జగిత్యాల పట్టణ పోలీసులు కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఓ షాపింగ్‌మాల్ వద్ద అనుమానస్పదంగా సంచరిస్తున్న మేకల రాజు అలియాస్ కిన్నరి, జగిత్యాల పట్టణానికి చెందిన ఆరుముళ్ల సాయికుమార్, ఆసిఫాబాద్‌కు చెందిన మడవి చందు అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోతున్న క్రమంలో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద సోదాలు చేయగా గంజాయి లభ్యం కాగా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వీరు గోదావరి నది అవతల ఉన్న ఊట్నూర్ ప్రాంతంలో మడవి చందు అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు 250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకుని జగిత్యాలలో విక్రయించేందుకు వచ్చిన క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. విచారణ జరిపిన న్యాయస్థానం నేర నిరూపణ కావడంతో నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన టౌన్‌ఇన్‌స్పెక్టర్ కిషోర్, పీపీ కె మల్లేశ్‌గౌడ్, సీఎంఎస్ ఎస్సై ఎస్ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌ను ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెడికల్‌షాపు ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన శుక్రవారం హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లికి చెందిన నర్సయ్య తన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని పట్టణంలోని సంజీవని మెడికల్‌షాపు ఎదుట నిలిపి మందుల కొనుగోలుకు వెళ్లాడు. తిరిగివచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. సీసీ కెమెరా ఫుటేజ్‌లో చూడగా గుర్తుతెలియని వ్యక్తి వాహనాన్ని తీసుకెళ్లాడు. వెంటనే నర్సయ్య హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ద్విచక్రవాహనంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఉన్నాయని బాధితుడు పేర్కొన్నాడు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శంకరపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శుక్రవారం కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వేగంగా శిథిలాల తొలగింపు



శిథిలాల తొలగింపు పనులు

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కూల్చివేసిన పాతభవనాల శిథిలాల తొలగింపు పనులు వేగవంతమయ్యాయి. దర్శనాలు నిలిపివేశారు. స్వామి వారికి చతుష్కాల పూజలు కొనసాగుతున్నాయి. కూల్చివేతల సందర్భంగా ఏర్పడిన శిథిలాల తొలగింపునకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు దర్శనాలను నిలిపివేసి ఆలయ ఆవరణ చుట్టూ రేకులతో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



వర్షిత్

కోరుట్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఓరుగంటి వర్షిత్ అండర్14విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్‌పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడికరీంనగర్‌జిల్లాలోని గర్రెపల్లిలో జరిగిన జిల్లాస్థాయిపోటీల్లో ఓరుగంటి వర్షిత్ జగిత్యాల జిల్లా తరుపునపాల్గొని ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి వర్షిత్‌ను నర్సింహమూర్తి, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

టామ్‌కామ్

- నకిలీ ఏజెంట్లకు చెక్
- గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి అవకాశాలు



చొప్పదండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి టామ్‌కామ్ ఒక వారధిగా నిలుస్తున్నది. నకిలీ ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లి నష్టపోయిన బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్)ను తీసుకువచ్చింది. ఏజెంట్లు, దళారుల ప్రమేయం లేకుండా టామ్‌కామ్ పని చేస్తుంది. విద్యార్హతలకు అనుగుణంగా అర్హులైనవారు తమ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది టామ్‌కామ్. మధ్యవర్తుల ద్వారా మోసపోకుండా ఈ సంస్థ పనిచేస్తూ యువతకు ఉద్యోగాలను కల్పిస్తున్నది.

● అనేక దేశాలకు...

టామ్‌కామ్ వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in లో దరఖాస్తు చేసుకున్న వారికి గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి కల్పిస్తుంది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, ఓమన్, యూఏఈతోపాటు జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, పోర్చుగల్, పోలాండ్, అమెరికా లాంటి దేశాలకు టామ్‌కామ్ పంపిస్తుంది. నైపుణ్యం ఉన్నవారిని అవసరమున్న దేశాలకు పంపిస్తుండగా, కొన్ని దేశాల సంస్థలు ఉద్యోగ నియామకాల కోసం టామ్‌కామ్‌ను సంప్రదిస్తున్నాయి. జర్మనీ, జపాన్ దేశాలకు ఎంపికైన వారికి అక్కడి భాషలు నేర్పించి పంపిస్తారు. మిగతా దేశాలకు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆంగ్ల భాషలో పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లో అందిస్తారు.

● ఖాళీలను బట్టి ఎంపిక...

టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ దేశాల్లో ఖాళీలను బట్టి ఎంపిక చేస్తుంది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబింగ్, ఫార్మా, భవన నిర్మాణరంగం, నర్సింగ్ విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేస్తుంది. దరఖాస్తు చేసుకున్నవారి అర్హతను బట్టి ఎంపిక చేస్తుంది. జర్మనీ, ఇజ్రాయిల్‌తోపాటు వివిధ దేశాల్లో ఉద్యోగ ఖాళీల కోసం ప్రస్తుతం టామ్‌కామ్ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఎంపిక కోసం ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ల్లో శిక్షణను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్‌ను అందజేస్తుంది. ఈ సర్టిఫికెట్లకు విదేశాలోనూ గుర్తింపు ఉంటుంది.

● దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

నైపుణ్యం కలిగినవారు విదేశాల్లో ఉద్యోగం కోసం టామ్‌కామ్ అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. విదేశాల్లో ఉన్న ఉద్యోగావకాశాలను దరఖాస్తుదారులకు సమాచారాన్ని అందిస్తారు. అర్హతనుబట్టి శిక్షణను ఇచ్చి ఉద్యోగాల్లో నియమిస్తారు. విదేశాల్లో ఎలాంటి మోసాలు, ఏజెంట్లు, మధ్యవర్తులు లేకుండా మంచి ఉద్యోగాలు పొందేందుకు టామ్‌కామ్ మంచి అవకాశాలు కల్పిస్తోంది.

పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్‌చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లోని టాప్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 2024నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్లలో కొంతమందికి మాత్రమే బెనిఫిట్స్ చెల్లించడం సరి కాదన్నారు. పెన్షనర్స్‌కు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు చేపడతామన్నారు. టాప్ర నాయకులు సమ్మయ్య, వీరస్వామి, వెంకటయ్య, కిష్టయ్య, కనుకయ్య, సాంబయ్య, హరికిషన్, రాజిరెడ్డి, శ్రీహరి, లక్ష్మీనారాయణ, స్వామిరెడ్డి, పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు 9,454క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఉమ్మడి జిల్లా భగవద్గీత శ్లోక కంఠస్త

పోటీలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భగవద్గీత శ్లోక కంఠస్త పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామ్స్ కార్య నిర్వాహకుడు కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, గాయత్రి విద్యానికేతన్‌లో 17న ఉదయం 10 గంటలకు, 18న కరీంనగర్ టీటీడీ కల్యాణమండపంలో ఉదయం 10గంటలకు, 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం బాలరాజుపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు, 20న జగిత్యాల జిల్లా కోరుట్ల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ స్థాయి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. చదివే అధ్యాయాలు తెలుసుకునేందుకు, పాల్గొనేందుకు, రిజిస్ట్రేషన్ కోసం 7396950725, 9441790725 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాశ్చాత్య సంస్కృతికి స్వస్తి పలకాలి

● హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి



అనుగ్రహభాషణం చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పాశ్చాత్య సంస్కృతికి స్వస్తి పలికి హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట గ్రామాల్లోని రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, పార్వతీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి ప్రతిష్టాపన ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. రాచర్లగొల్లపల్లిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ స్థలాన్ని విద్యారణ్య భారతీస్వామి పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు. భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి హిందూ ధర్మాన్ని మర్చిపోతున్నారన్నారు. చిన్నతనం నుంచే పుట్టిన రోజున ఆధ్యాత్మికత పెంపొందించేందుకు పిల్లలతో భగవద్గీత, రామాయణం, హిందూ ధర్మ పుస్తకాలను అందజేసేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, స్థానికకాంగ్రెస్ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

● వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి చదువుతున్న పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్‌బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వఉన్నత పాఠశాలను వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పాఠశాలతరగతి గదులు, మధ్యాహ్న బోజనశాల, క్రీడామైదానం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు- తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సంబంధించి తల్లిదండ్రులకు పలు సూచనలను చేశారు. పదోతరగతి విద్యార్థులకు స్టడీహవర్స్, పరీక్షలకు సిద్ధత,పాఠశాలకు హాజరుశాతం, పిల్లల పరిరక్షణపై తల్లిదండ్రులు దృషిపెట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఐఎఫ్‌బీ ప్యానల్ టీవీలద్వారా కంప్యూటర్‌విద్యను కూడా తప్పనిసరి చేశారన్నారు. అక్టోబరునుంచే పదో తరగతి విద్యార్థులకు స్టడీ హవర్స్‌ను ప్రారంభించామన్నారు. ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు శారద, చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులతో పాఠశాల విద్యాకార్యకలాపాలపై సమీక్షించారు. బాలలదినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు

మంజూరు చేయాలి

చిగురుమామిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ(సీతక్క)కు లేఖలు రాసినట్లు తెలిపారు. ఈసందర్భంగా విలేకరుతో మాట్లాడారు. 2020,2025లో కురిసిన భారీ వర్షాలకు అనేకగ్రామాల్లో రోడ్లు చెరువులు దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని రేకొండ -మొగిళిపాలెం, పెద్దమ్మపల్లిలో బ్రిడ్జిలు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ విషయాన్ని సీఎంరేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

ఎన్‌టీపీసీలో నూతన ఆవిష్కరణలు

● వంద మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం ● ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకల్లో ఈడీ చందన్ కుమార్ సామంత



కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

జ్యోతినగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో త్వరలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. 48వ ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఏటీఎం బిల్డింగ్‌ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో త్వరలో వంద మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల భవిష్యత్‌లో విద్యుత్ రంగం కీలకం కానున్నదన్నారు. అలాగే కార్బొనేటెడ్ బ్రిక్స్ ప్లాంటును ఎన్టీపీసీలో నిర్మించనున్నట్లు తెలిపారు. 48 ఏళ్లుగా ఎన్టీపీసీ దక్షిణాదికి వెలుగులను అందిస్తోందని, ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ మిగతా ప్రాజెక్టులకు పోటీగా నిలుస్తుందన్నారు. దేశంలో సౌరవిద్యుత్ స్థాపిత సామర్థ్యం పెరిగిన నేపథ్యంలో థర్మల్‌విద్యుత్ డిమాండ్ తగ్గిందని, రామగుండం ఎన్టీపీసీలో సైతం విద్యుత్ ఉత్పత్తిని కుదించాల్సి వచ్చిందన్నారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ పథకం ద్వారా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ సహకారంతో ఈప్రాంతంలో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధిపనులు చేస్తున్నామన్నారు.

ఘనంగా రేజింగ్ డే వేడుకలు..

రామగుండం ప్రాజెక్టు రేజింగ్‌డే సందర్భంగా శుక్రవారం ఉత్సవాలను నిర్వహించారు. ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చందన్ కుమార్ పాల్గొని ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పలు పోటీలలో విజేతలకు ఈడీ, ఇతరఅధికారులు బహుమ తులను అందించారు. వివిధవిభాగాల జనరల్‌మేనేజర్లు, హెచ్‌ఓడీలు, ఈజీఎం, హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిగ్దర్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ శాస్త్రి, ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి



గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 24వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వరదలు, ముంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ● సిరిసిల్ల మానేరులో ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖల మాక్‌డ్రిల్



సిరిసిల్ల మానేరువాగు ఒడ్డున అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరదలు, ముంపు నివారణ అవగాహనతో సాధ్యమని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. సిరిసిల్ల మానేరు వాగులో శుక్రవారం కమ్యూనిటీ అవేర్‌నెస్‌లో భాగంగా భారత ప్రభుత్వం, హోంశాఖల ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా అదనపుకలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విహార యాత్రలకు వెళ్లే పర్యాటకులు, సరదాగా నది తీరాల్లో విహరించే వారు, ఈతరానివారు నీళ్లలో మునిగిపోయినప్పుడు ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. వరదలు సంభవించినప్పుడు, అకస్మాతుగా నీరు పట్టణాలు, గ్రామాల్లోకి వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీ బాటిల్స్, క్యాన్స్, థర్మకోల్‌షీట్స్, ప్లాస్టిక్‌బిందెలు, ఎండిన కొబ్బరి బోండాలు మొదలగునవి ఉపయోగించి నీటిలో తెలియాడే పద్ధ తులు తెలియజేశారు. నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని ఎలా బయటకు తీయాలో చూపించారు. బయటకు తీసుకువచ్చిన వ్యక్తికి సీపీఆర్, కృత్రిమ శ్వాస ఎలా అందించాలి, నీరు ఎలా బయటకు రప్పించాలో చూపించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అపద సమయంలో ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ గౌతం, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో అఫ్జల్ బేగం, సీపీవో శ్రీనివాసచారీ, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో శుక్రవారం భక్తులరద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ, కల్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో..

వేములవాడపట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. భక్తులతో బద్ది పోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

జీవితంపై విరక్తి చెంది ఒకరి బలవన్మరణం



హన్మంతు(ఫైల్)

గొల్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగదాముని పల్లె గ్రామంలో ఈర్తి హన్మంతు(47) అనేవ్యక్తి తన పంట పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..హన్మంతు కొంత కాలంగా తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బునయం కోసం పలు అసుపత్రుల చుట్టూ తిరిగి లక్షలు వెచ్చించి వైద్య చికిత్సలు చేయించుకున్నప్పటికి రోగం నయం కాలేదు.. దీనికి తోడు అప్పులు చేసి వైద్య చికిత్సలు చేయించుకోవడంతో ఆర్థిక భారం మీద పడింది. ఆరోగ్యం సహకరించడంలేదని..అప్పులెలా తీర్చేది అంటూ తరచుగా మదనపడుతూ ఉండేవాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తన పంట పొలం వద్ద చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శంకర్(ఫైల్)

రుద్రంగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌పై నుంచి పడిన వ్యక్తి గాయపడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంధం శంకర్(55) బుధవారం తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో శంకర్ తలకు, నడుముకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శంకర్ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్



సర్టిఫికేట్‌లను ప్రదానం చేస్తున్న జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్

రామగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఫిజిక్స్ కెమిస్ట్రీలో సాంకేతిక అభివృద్ధిపై జరిగిన వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తితోపాటు అవగాహన పెంచడానికి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. వర్క్‌షాప్ సెమినార్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ప్రయోగాత్మక పరిశోధనలు చేశారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, వరంగల్ నిట్ ప్రొఫెసర్స్ లక్ష్మారెడ్డి, హరనాథ్, కన్వీనర్లు శంకర్, మహేందర్, రాజేశ్ కుమార్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు రాంతేజ, శ్రీజ,నవ్య, ప్రణీత్, వర్షిత, మమత, సమీద్, తేజ, కరీంనగర్, వాగేశ్వరీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంజేపీ విద్యార్థుల ఎంపిక



జ్ఞాపికతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ వీరప్రభాకర్, అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీరప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల11 నుంచి 13వరకు సుల్తానాబాద్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. కబడ్డీ పోటీలో విద్యార్థులు రాణించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. చెస్‌లో అఖిల్ రెండో స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో గిరి బంగారు పతకం, వివేక్ కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో వంశీ బంగారు, 1500 మీటర్ల పరుగు పందెంలో వివేక్ కాంస్య, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో సాకేత్ కాంస్య, వెండి పతకాలను సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ హన్మంతరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



నివాళులు అర్పిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మాజీ ప్రధాని పండిట్ జవ హర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు వినోదాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయవచ్చన్నారు.

ట్రినిటీ స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో ఫిట్‌ఫెస్ట్ వార్షిక క్రీడలను నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, చైర్‌పర్సన్, అకాడమిక్ డైరెక్టర్ దాసరి మమతారెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల, కో ఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మానేరు హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యాసంస్థల అధినేత కడారి అనంత రెడ్డి వేడుకలను ప్రారంభించారు. డైరెక్టర్ కడారి సునిత, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారమిత పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ప్రారంభించారు. డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మదర్స్‌లాప్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, అరుణ, రజిత, శారద, శ్రీవాణి, రాధా, శ్రావ్య పాల్గొన్నారు.

భగత్‌నగర్: నగరంలోని సెయింట్ జార్జ్, ప్యారడైజ్ పాఠశాలల్లో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

విద్యానగర్, తీగలగుట్టపల్లి, రేకుర్తిలోని నినోస్ బ్లాక్‌లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్‌లు వసంత, భార్గవ్, ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపాల్‌లు మధు, ప్రసాద్‌రెడ్డి, నిరంజన్, పవర్‌కిడ్స్ ఇన్‌చార్జి సంధ్య, నినోస్ బ్లాక్ ఇన్‌చార్జి సంగీత, సంధ్య, స్వప్న పాల్గొన్నారు.

భగత్‌నగర్: విజన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, పాఠశాల డైరెక్టర్ సందవేణి వెంకట్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

● ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు పాఠ్యాంశాలను బోధించారు.

వీణవంక:మండలంలోని రెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్‌తో పాటు పలు గ్రామల్లోన్ని పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. రెడ్డిపల్లి పాఠశాలలో పలువురు దాతలు రూ.50 వేల విలువైన దుస్తులు షూ, వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. ఎంఈవో శోభరాణి పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటలోని కాకతీయ, విద్యోదయ, న్యూమిలీనియం ప్లే స్కూల్, కేరళ, లోటస్ పాండ్, వాక్స్‌పాప్, ఎస్వీ, జయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల,ప్రభుత్వ పాఠశాలల్లో చిల్డ్రేన్స్ డే నిర్వహించారు.

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అయిలయ్య పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

గంగాధర: ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గంగాధర ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల సుమంత్, నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులతో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి

పత్తి పంట.. సీసీఐ తంటా

(5వ పేజీ తరువాయి)

ప్రతి సంవత్సరం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను అక్టోబరు మొదటి వారంలోనే ప్రారంభిస్తుంది. ఈసారి వర్షాల కారణంగా ఈ కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభ మయ్యాయి. అకాల వర్షాల కారణంగా పత్తిలో తేమశాతం ఎక్కువ ఉందని కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభించారు. అంతేకాకుండా తేమ ఎక్కువ ఉన్న పత్తి రంగు మారుతుందని భావించి కొనుగోళ్లు ముమ్మరం చేయలేదు. సీసీఐ ఎకరాకు ఒక్కో రైతు నుంచి 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేది. దీనితో సగటు దిగుబడి మొత్తం సీసీఐ కొనుగోలు చేసే నేపథ్యంలో రైతులు కనీస మద్దతు ధర పొందే అవకాశముండేది. ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తొలి రోజుల్లో ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున పత్తిని కొనుగోలు చేసినా ఇప్పుడు తాజాగా 7 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేసేందుకు సీసీఐ ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో రైతులు ఒక్కో ఎకరంలో పండిన పత్తి పంటను 3 నుంచి 5 క్వింటాళ్ళ మేరకు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల యజమానులకు తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తోంది. దీంతో రైతులు ఎకరంపై 6 నుంచి 10వేల రూపాయల మేరకు నష్టపోతున్నారు.

జూబ్లీహిల్స్ గెలుపు కాంగ్రెస్ అభివృద్ధికి మలుపు

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ గెలుపు కాంగ్రెస్ అభివృద్ధికి మలుపు అని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మరోసారి రుజువైందని తెలిపారు.

గ్రేడింగ్ పూర్తయిన ఇళ్లను ప్రారంభించాలి

తిమ్మాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేడింగ్ పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను వెంటనే ప్రారంభించి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్‌ఎండీ కాలనీ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలుతదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2025-26కు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు నాగైలేశ్వర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుల ఆరోగ్య రక్షణ సామాజిక బాధ్యత

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల ఆరోగ్య రక్షణ సామాజిక బాధ్యతగా భావించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఐఎంఏ కరీంనగర్‌శాఖ నిర్వహించిన ఉచిత మధుమేహ పరీక్షల శిబిరంలో మాట్లాడారు. ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ, కార్యదర్శి డాక్టర్ ఎన్.మహేశ్‌బాబు, కోశాధికారి డాక్టర్ వి.నీలిమా, ఎండీ డాక్టర్ శ్రీకర్, డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కేడీసీసీబీలో సహకార వారోత్సవాలు

కరీంనగర్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో 72వ సహకార వారోత్సవాలను శుక్రవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. వైస్ చైర్మన్ పి.రమేశ్, డైరెక్టర్ స్వామిరెడ్డి, సీఈవో ఎన్.సత్యనారాయణ రావు, జనరల్ మేనేజర్లు బి.శ్రీధర్, మహ్మద్ రియాజుద్దీన్‌తో కలిసి సహకార జెండా ఆవిష్కరించారు. కేడీసీసీబీ చైర్మన్ ఐ ఫోన్ వినియోగదారుల కోసం మొబైల్ యాప్‌ను ప్రారంభించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు జెండా ఆవిష్కరించారు.

జమ్మికుంటలో 2కే రన్

జమ్మికుంట రూరల్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): జమ్మికుంటలో వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా హుజూరాబాద్, జమ్మికుంట ఐఎంఏ ఆధ్వర్యంలో



జమ్మికుంటలో 2కె రన్ నిర్వహిస్తున్న డాక్టర్లు

శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుపతి, డాక్టర్ రాము, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ దేవేందర్‌రెడ్డి, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బిర్లా, ఎస్పీఆర్ పాఠశాలల్లో చిల్డ్రన్స్ డే



బిర్లాలో బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం



రామాయణం ప్రదర్శనలో విద్యార్థులు

కరీంనగర్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషన్ స్కూల్‌లో మ్యాజిక్ షో ఆకట్టుకుంది. ప్రసిద్ధ ఇంద్రజాలికుడు చొక్కాపు వెంకట రమణ తన ప్రదర్శనతో మంత్ర ముగ్ధులను చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ ఎస్పీఆర్ పాఠశాలలో స్వయం పరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎం.విజయ మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ యాకయ్య డైరెక్టర్‌లు డాక్టర్ పీఆర్ రాజేందర్, డాక్టర్ జి.ప్రశాంత్, డాక్టర్ కె.శ్యాంసుందర్, మేనేజింగ్ డైరెక్టర్ బి.ఉపేందర్, ప్రధానోపాధ్యాయుడు కె.చుక్కారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక యజ్ఞవరాహ క్షేత్రంలో మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మహాలక్ష్మీ యాగం, మహాపూర్ణాహుతి అనంతరం కుంభ జల ప్రోక్షణ చేశారు. ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీ శిశుమందిర్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

కరీంనగర్ టౌన్: స్థానిక శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శిశు మందిరాల వ్యవస్థాపకుడు శఠగోపం లక్ష్మినరసింహాచార్యులు జయంతి సందర్భంగా శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. పతకమూరి శ్రీనివాస్‌రావు, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ రవీందర్, విభాగ్ అధ్యక్షుడు ముక్కాల సీతారాములు పాల్గొన్నారు.

జవహర్ లాల్ నెహ్రూకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ మొదటి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం డీసీసీ కార్యాలయంతోపాటు నగరంలోని సవరన్ స్ట్రీట్ నెహ్రూ విగ్రహం స్థానంలో వేడుకలు నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగరంలోని సవరన్ స్ట్రీట్‌లో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నివాళులు అర్పించారు. నాయకులు పులి అంజనేయులు గౌడ్, వెన్నం రజితరెడ్డి, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, జమాలుద్దీన్, వంగల విద్యాసాగర్, అబ్దుల్ భారీ, కుంభాల రాజకుమార్, బషీరుద్దీన్, షబానా మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: జవహర్‌లాల్ సేవలు మరువలేనివని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతి నిర్వహించారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ ఓదెలు, వైస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని ప్రధాన కూడలీ వద్ద కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి పీటీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ విన్సెంట్ జార్జ్, డైరెక్టర్లు గౌతమ్‌రెడ్డి, సంపత్, ఉపాధ్యాయులు, రాజు, సంపత్, పీటర్, వాణిశ్రీ, సరిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు బీఆర్‌ఎస్ మద్దతు

గన్నేరువరం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండల యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న గుండ్లపల్లి హైవేపై నిర్వహించే మహాధర్నాకు మండల బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు డబుల్ రోడ్డు మీద చూపిన ఆసక్తి గెలిచాక ఎందుకు లేదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ప్రశ్నించారు. మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నిలయాలు.. గ్రంథాలయాలు



మాట్లాడుతున్న డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, కాలమిస్ట్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో మాట్లాడారు. పుస్తక పఠనంతో మెదడు చురుకుదనం, విషయ పరిజ్ఞానం వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. గ్రేడ్-1 లైబ్రేరియన్ అర్జున్, గ్రేడ్-3 లైబ్రేరియన్ సరిత పాల్గొన్నారు.

● విజ్ఞాన వికాస సోపానాలు గ్రంథాలయాలని, ప్రతీ పౌరుడు విజ్ఞానం పెంచుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని తెలంగాణ గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు కొలిపాక సత్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ అరుణ, నాగరాజు,, విద్యార్థులు పాల్గొన్నారు.

'నీల్ బత్తె సన్నాట' సినిమాను ఆదర్శంగా తీసుకోవాలి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'నీల్ బత్తె సన్నాట' అనే హిందీ సినిమాను చిన్నారులు ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా ఫిలింభవన్‌లో శుక్ర, శని, ఆది వారాల్లో నిర్వహించే బాలల చలన చిత్రోత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తల్లి దండ్రులు పడే కష్టం విలువ తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆమె ఇటీవల పాడిన పిచ్చుకా చిన్నారి పిచ్చుకా ఆడియో, వీడియో పాటతోపాటు పంచతంత్ర చిత్రం ప్రదర్శించారు. కఫిసొ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి లక్ష్మీగౌతమ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజాఫర్, రమణారావు, అన్నవరం దేవేందర్, పీఎస్ రవీంద్ర, వెంకటేశం,దశరథం, సురేశ్, అనిల్‌కుమార్, కందుకూరి అంజయ్య, విద్యార్థులు, తదిరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

28 మందికి ఉచితంగా మోకీలు మార్పిడి

సుభాష్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 28 మంది పేదలకు ఉచితంగా మోకీలు మార్పిడి చేయించామని హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్‌కు చెందిన స్వరూప(63 ఉచితంగా మోకీలు ఆపరేషన్ చేయించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఆదర్శ ఆసుపత్రిలో మాట్లాడారు. పేదలకు తన వంతుగా సహాయం అందించాలనే ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్టర్ అనిల్‌కుమార్ కరీంనగర్ ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోస్టేట్ గ్రంథి సమస్యకు ఆధునిక చికిత్స

సుభాష్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మగవారిలో వయస్సుతో ప్రోస్టేట్ గ్రంథి పెరిగితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చిందని యశోద ఆసుపత్రి సోమాజిగూడ యూరాలజిస్టు డాక్టర్ అమన్ చంద్ర దేశ్ పాండే తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. సమస్యను ప్రారంభదశలో గురిస్తే మందులతోనే నయం చేయవచ్చన్నారు. ఆపరేషన్ అవసరమైన ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చిందని తెలిపారు కోత లేకుండా ఒక్కరోజులోనే చికిత్స పూర్తి చేసి పంపిస్తారన్నారు.

● న్యూస్‌బాక్స్

డయాబెటిస్‌పై అవగాహన

క్రరీంనగర్ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డయాబెటిస్ అవగాహన దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్320జీ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని అస్త్రా కన్వెన్షన్ హాల్‌లో డయాబెటిస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీమ్‌రావు యోగాతో పాటు పలు అంశాలను వివరించారు.

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

స్వెటర్ల అందజేత

గణేశ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): జిల్లా షెడ్యూల్డ్ కులా అభివృద్ధి శాఖ పరిధిలోని వసతి గృహాల విద్యార్థులకు చలికాలం దృష్ట్యా శుక్రవారం స్వెటర్లు, క్యాప్‌లను ఆ శాఖ ఉపసంచాలకుడు నాగైలేశ్వర్ అందజేశారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతి, వసతిగృహ సంక్షేమ అధికారులు రవి, న్యాయని పరమేష్, గోవర్ధన్, రవీందర్ పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో వార్డెన్ ప్రవీణ్ స్వెటర్లు పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

కరీంనగర్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ శివారులోని మైనారిటీగురుకులంలో ఇంటర్ విద్యార్థి నదీమొద్దీన్ ఇటీవల ప్రమాదవశాత్తు లారీ ఢీ కొని మరణించగా శుక్రవారం విద్యార్థికి కుటంబానికి కరీంనగర్ బాయ్స్-3, కళాశాల తరఫునపున ఆర్థిక సాయం అందజేశారు. కరీంనగర్ బాయ్స్ 3తోపాటు కరీంనగర్ బాయ్స్-2, కరీంనగర్ గర్ల్స్-2, సిరిసిల్ల గర్ల్స్ కళాశాలలోని ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యా యులు రూ.లక్షా 50 వేలు సేకరించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కరీంనగర్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలోని శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. శివశక్తి ఫౌండర్ రమేశ్, సభ్యులు రజిత, భుజందర్, సతీష్, శ్యామ్ ఉన్నారు.

హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలి

గన్నేరువరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కల్వర్టుల వద్ద నెల రోజులలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని తెలంగాణ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి బామండ్ల రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హన్మాజిపల్లి ఎక్స్‌రోడ్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు.

ముగిసిన టీకా కార్యక్రమం

సైదాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఈ నెల 13తో ముగిసింది. శుక్రవారం మండలంలోని గ్రామాలు తిరిగి టీకా వేయించని పశువులకు టీకాలు వేశారు. పశు వైద్యాధికారి విజేందర్‌రావు ఉన్నారు.

సదుపాయాలు కల్పించాలి

గణేశ్‌నగర్,నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్వే నిర్వహించారు. తాగడానికి మంచినీరు కూడా లేకుండా కళాశాలను నడిపిస్తున్న పరిస్థితి ఉందన్నారు.

ఉప ఎన్నికలో గెలుపుపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కరీంనగర్ అర్బన్/గణేష్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసం వద్ద డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. టీపీసీసీ కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి అంజనేయులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద వేడుకలు నిర్వహించారు. డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ ఖలీం, మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో అహ్మద్ పుర చౌరస్తా సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.



సంబరాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

మానకొండూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని కార్యకర్తలతో నృత్యం చేశారు.

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద పార్టీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్, పార్టీ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీణవంక: పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కొమ్మడి రాకేష్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, అయిలయ్య, రాజిరెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సీనియర్ నాయకులు దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చిగురుమామిడి: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గన్నేరువరం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి.

● అవీఇవీ..

కరీంనగర్ టౌన్: నగరంలోని స్వర్ణకార సంఘ భవనంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) కరీంనగర్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు వోపా నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దె తిరుమల వెంకటేశ్వర్లు, మధుసూధనాచారి ప్రకటనలో తెలిపారు.

-గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల జిల్లా సమన్వయ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

గన్నేరువరం : మండలంలోని పారువెల్ల కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకటరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) కిట్లను అందజేశారు.

- మండలంలోని మైలారం మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి డిసెంబరు 27 వరకు అయ్యప్ప స్వాములకు ప్రతిరోజు ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహిం చనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములు తెలిపారు.

-గునుకుల కొండాపూర్‌లో విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు.

బిహార్ ఓటర్లది చారిత్రక తీర్పు



హుజూరాబాద్‌లో సంబరాల్లో బీజేపీ నాయకులు

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): బిహార్ ఓటర్లది చారిత్రక తీర్పు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంపై పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: తెలంగాణ చౌక్‌లో బీజేపీ నేత మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిలపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలీ వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేపట్టారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో నాయకులు వెంకటరెడ్డి, రాములు, అశోక్, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో సంబరాల్లో బీజేపీ నాయకులు